క్లుప్తంగా

సంఘాలు ఏర్పాటు చేయించాలి

ఏపీఎం బాలయ్య

తాండూరు రూరల్: గ్రామాల్లోని దివ్యాంగులు, వృద్ధులు, కిషోరబాలికల సర్వే నిర్వహించి సంఘాలను ఏర్పాటు చేయించాలని తాండూరు మండల ఏపీఎం బాలయ్య ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని అల్లాపూర్, రాంపూర్‌తండాతో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ..ఈ నెల 15వ తేదీ నుంచి 31వరకు సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంక్ ఖాతాలు తెరిపించాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులతో, 15 నుంచి 18 సంవత్సరాల కిషోరబాలికలతో, దివ్యాంగులతో సంఘాలు ఏర్పాటు చేయించాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సంఘాలకు ప్రభుత్వం నుంచి రుణాలు మంజూరవుతాయన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కుల్కచర్ల: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే కుటుంబాలు, వ్యవస్థ అభివృద్ధిపథంలో ముందుకువెళ్లడం జరుగుతుందని కుల్కచర్ల ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం అంతారం, సాల్వీడు గ్రామాలలో మహిళ సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలు సంఘాల ఆధ్వర్యంలో రుణాలు పొంది ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఆహార సంబంధిత విషయంలో బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సంతోష, సీసీలు శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సేవ చేస్తేనే సంతృప్తి



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న సంతోష్‌కుమార్ తదితరులు

తాండూరు రూరల్: పేద విద్యార్థులకు సేవ చేస్తేనే సంతృప్తి కలుగుతుందని ఆర్‌ఎస్‌కే ఫౌండేషన్ చైర్మన్ రొంపల్లి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం ఇందూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు టై, బెల్టులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ..వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు సహకారంతో అందజేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఆర్‌ఎస్‌కే ఫౌండేషన్ తరుపున పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సింగ్‌రావు, వాసవిక్లబ్ వైస్ గవర్నర్ రమేశ్, మహేశ్, సోమశేఖర్, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

యూరియా సరిపడా ఉంచాలి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతగిరి: జిల్లాలో యూరియా, డీఏపీ, ఎరువులను సీఎంఎస్, పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ కోరారు. బుధవారం స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా, డీఏపీ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని స్పీకర్ దృష్టికి తెచ్చారు. వెంటనే ఈ విషయంలో బాధ్యులపై చట్టపర చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, నవీన్, లక్ష్మయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, లాలయ్య, రవికుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మూడో రోజు బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలో భక్తులు ఉత్సాహంతో పాల్గొని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఈ పూజలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరిరాజేశ్ రెడ్డి, ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, డైరెక్టర్ మల్లేశం, తదితరులు హాజరయ్యారు. అనంతరం వారు మొక్కలు నాటారు. ఈ ప్రాంతంలో వనమహోత్సవం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో విజయవర్ధన్, హిందూవాహిని, బీజేపీ నాయకులు జగదీశ్వర్, కాంగ్రెస్ మండల నాయకులు రాములు, అంజిల్‌రెడ్డి, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ఆదమరిస్తే అంతే!

- అధ్వానంగా లక్ష్మీనారాయణపూర్–యాలాల ప్రధాన రోడ్డు
- చిన్నపాటి వర్షానికి గుంతల్లో చేరుతున్న వరద
- చిత్తడిగా మారుతున్న రహదారులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



హాజీపూర్ సమీపంలో గుంతలమయంగా రోడ్డు

యాలాల: మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల వరకు ప్రయాణం అంటేనే వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. ఈ మార్గంలో అడుగుకో గుంత, చినుకుకే చిత్తడిగా మారుతున్న రహదారులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్ష్మీనారాయణపూర్ నుంచి బెన్నూరు వరకు గతంలో మరమ్మతులు చేపట్టేందుకు రోడ్డు మధ్య భాగంలో తవ్వి వదిలేశారు. అనంతరం గుంతల్లో మొరం పోసి చదును చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ మొరం కొట్టుకుపోయి గుంతలుగా తయారయ్యాయి. దీంతో ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ప్రధాన రోడ్డు చిత్తడిగా మారడంతో పాటు జక్కేపల్లి, హాజీపూర్, సంగెంకుర్దు స్టేజీల సమీపంలో రోడ్డు గుంతలుగా తయారైంది. గుంతలతో ఈ ఏడాది బెన్నూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే మార్గంలో ప్రతీ రోజు మండల కేంద్రంలోని కార్యాలయాలకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌ఐతో పాటు అన్ని శాఖల అధికారులు రాకపోకలు నిర్వహిస్తుంటారు. కానీ రోడ్డు సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రమాదకరంగా కల్వర్టు భాగం

జక్కేపల్లి గేటు సమీపంలో గతంలో నిర్మించిన కల్వర్టు ప్రాంతం వాహనదారులకు శాపంగా మారింది. కల్వర్టు నిర్మించిన ప్రాంతంలో సిమెంటు బెడ్డు పైకి రాగా, బీటీ రోడ్డు కిందికి కుచించుకుపోతుంది. దీంతో పలుమార్లు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ విషయంలో అటు అధికారులు, అధికారపార్టీ నాయకులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన

గ్రామాల్లో అప్రమత్తమైన వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెత్త చెదారం, మురుగు నీటి నిల్వలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. బుధవారం సాక్షి పత్రికలో దోమకాటు..ఆరోగ్యానికి వేటు అనే కథనం ప్రచురించారు. దీనికి స్పందించిన వైద్య సిబ్బంది పలు గ్రామాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లపై పేరుకుపోతున్న మురుగును తొలగించారు. దుద్యాల్, హకీంపేట్ గ్రామాల్లో వైద్య సిబ్బంది వీధుల గుండా తిరుగుతూ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు.



హకీంపేట్‌లో నిల్వ నీటిని పారబోయాలని సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి



స్పోర్ట్స్ కిట్స్, యూనిఫాం, నోట్‌బుక్స్ అందజేస్తున్న సురేశ్ తదితరులు

దోమ: విద్యార్థులు తప్పనిసరిగా క్రమశిక్షణతో చదువుకోవాలని ఐలాబాద్ తండా వాసి వర్ధ్య సురేశ్ తెలిపారు. బుధవారం ఐలాబాద్ తండా ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ వెంకట్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అమర్నాథ్‌తో కలిసి స్పోర్ట్స్ కిట్స్, యూనీఫాం, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే చదువుకుంటారని అలాంటి వారికి ప్రతీఒక్కరు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పల్లవి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, సీఆర్‌పీ రఘుసింగ్, గ్రామస్తులు రాజు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోండి

బొంరాస్‌పేట: తెలంగాణ జానపదులను ఆకట్టుకునే వీధినాటక ప్రదర్శనలతో జీవనోపాధి పొందిన వీధినాటకోపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బుధవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. యాలాల, బొంరాస్‌పేట, తదితర మండలాలకు చెందిన వీధినాటకోపాధ్యాయులు తమ జీవనోపాధికి రూ.15 వేల పింఛను, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, ఉచిత బస్‌పాస్, కుటుంబజీవిత బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. వీరిలో జిల్లా వీధినాటకోపాధ్యాయులు చాకలి రాములు, కాశీంపూర్ అంజిలయ్య, కొత్తూరు వెంకటయ్య, తుంకిమెట్ల శికుమార్, మెట్లకుంట వెంకటయ్య, ఏర్పుమళ్ల చంద్రయ్య, రేగడిమైలారం మైసప్ప తదితరులున్నారు.

ముంపు రానివ్వం

- నాలాల ద్వారా వరద నీరు మళ్లింపునకు చర్యలు
- డ్రైనేజీ నిర్మాణానికి కొత్తగా ప్రతిపాదనలు
- మండల ప్రత్యేక అధికారి, డీఎస్‌ఓ సుదర్శనం వెల్లడి

బషీరాబాద్: జీవన్గీలో ఇకపై వరద ముంపు రానివ్వకుండా శాశ్వత నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శనం తెలిపారు. బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ షాహెదాబేగం, ఎంపీడీఓ విజయ్ కుమార్, సూపరింటెండెంట్ విజయకుమారి, మండల వైద్యాధికారి గోపాల్, టెక్నికల్ అసిస్టెంట్ నర్సింహ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ ముంపునకు కారణమైన రెండు నాలాలను అధికారుల బృందం పరిశీలించింది. ఎగువనున్న పంట పొలాల నుంచి దళిత కాలనీకి వచ్చేరెండు నాలాలు కలిసే ప్రాంతంలో దట్టమైన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఉండడంతో వరద నీరు దిగువకు వెళ్లకుండా జనవాసాల్లోకి మళ్లినట్లు అధికారులు గుర్తించారు. ఇకపై ఎంత వర్షం కురిసినా వరద రాకుండా కొత్తగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీని కోసం ఇంజినీర్లతో ప్రతిపాదనలు తయారుచేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని ప్రత్యేక అధికారి సుదర్శనం మీడియాకు తెలిపారు. వరద బాధితులకు ఇప్పటికే పదికిలోల చొప్పున బియ్యం పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా అధికారుల బృందం వరద బాధితులతో మాట్లాడకుండా నాలాలను మాత్రమే పరిశీలించి వెళ్లడమేంటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోటం మానిక్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముంపు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి సుదర్శనం, మండల అధికారుల బృందం

మొండి బకాయిదారులకు జప్తు నోటీసులు

యాలాల: ఏళ్ల తరబడి విద్యుత్ బకాయిలు చెల్లించకుండా మొండిపడిన వినియోగదారులకు ట్రాన్స్‌కో అధికారులు జప్తు నోటీసులు జారీ చేశారు. రూ.వేలల్లో బకాయి ఉన్న వినియోగదారుల ఇంటికి, సర్వీస్ నంబర్ పేర్కొంటూ, బకాయి సొమ్ము వివరాలను తెలిసేలా స్టిక్కర్లను అతికించారు. జప్తు నోటీసులు జారీ చేసిన తేదీ నుంచి 15 రోజుల్లో చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లితో పాటు కోకట్, యాలాల గ్రామాల్లో సైతం ట్రాన్స్‌కో అధికారులు పలువురు వినియోగదారుల ఇళ్లకు నోటీసులు అతికించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ రఘువీర్ మాట్లాడుతూ..వినియోగదారులు కరెంటు బకాయిలను ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించాలన్నారు. ఏళ్లుగా బకాయి పడి, రూ. వేలల్లో ఉన్నవారికి మాత్రమే ట్రాన్స్‌కో అకౌంట్స్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. నోటీసులు అందుకున్న వారు ఏడీ కార్యాలయంలోని అకౌంట్ సెక్షన్‌లో చెల్లించాలని సూచించారు.



తిమ్మాయిపల్లిలో ఓ ఇంటికి జప్తు నోటీసును అతికించిన ట్రాన్స్‌కో అధికారులు

రైతుబీమా దరఖాస్తుల సమీక్ష

బొంరాస్‌పేట: రైతు బీమా దరఖాస్తులను కొడంగల్ ఏడీఏ శంకర్‌నాయక్ సమీక్షించారు. మండల పరిధిలోని రేగడిమైలారం రైతు వేదికలో దరఖాస్తులు తీసుకున్నారు. దరఖాస్తు గడువు బుధవారంతో ముగియనుండడంతో ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హేమ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం వడ్డించాలి

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: ప్రతీరోజు పౌష్టికాహారం వడ్డించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను తహసీల్దార్ రవీందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. ప్రభుత్వ మెను ప్రకారం మధ్యాహ్న భోజనం వండి పెట్టాలని ఆమె సూచించారు. ఉపాధ్యాయులు ప్రతీరోజు పర్యవేక్షించాలన్నారు. సన్న బియ్యం సరఫరా నాణ్యత లోపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. అనంతనం వంట గదిలోని సరుకులను ఆమె పరిశీలించారు. అంతకు ముందు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ వచ్చే మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందునా తగు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ మల్లేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పీఈటీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

దుద్యాల్: చెట్టుపల్లి తండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పీఈటీ పోస్టు ఖాళీగా ఉందని ప్రత్యేక అధికారిణి రాధిక రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీగా అవకాశం ఉందని, బీపెడ్ అర్హత కల్గిన వారు పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మహిళలు మాత్రమే దీనికి అర్హులు అని, వేతనం రూ. 14వేలు ఉంటుందని పేర్కొన్నారు. మండల వాసులకు ప్రాధాన్యత ఉంటుందని పూర్తి వివరాలకు పాఠశాలలో గురువారం సంప్రదించాలని సూచించారు.

విజయవంతం చేయాలి

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూర్‌లో నిర్వహించనున్న రాజకీయ, చైతన్య ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాలె లక్ష్మణ్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆర్యవైశ్య ప్రతినిధులు పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.



గ్రామ కాంగ్రెస్ కమిటీని సన్మానిస్తున్న నేతలు

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. బుధవారం చెల్లాపూర్‌లో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతీ పేదవాడిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. ఇళ్లులేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. అనంతరం నూతన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా ధానగళ్ల ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, మాజీ ఎంపీపీ అంజిలయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, ఏఎంసీ డైరెక్టర్లు రాంచంద్రయ్య, భరత్‌కుమార్ రెడ్డి, నాయకులు కృష్ణయ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పరిగి: అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని సీనియర్ నాయకుడు వెంకటేశ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆయన పరిశీలించారు. మొదటి బిల్లు బేస్మెంట్ లెవల్ పూర్తయిన వారి వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. ఇళ్లు మంజూరుకాని వారు దిగులు చెందాల్సిన అవసరం లేదని రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బడేంపల్లి గ్రామానికి చెందిన జ్యోతి మహిళా సంఘాల అభ్యున్నతితో పేపర్ ప్లేట్స్, గ్లాసుల తయారీ కేంద్రాన్ని ఆమె ఏర్పాటు చేసుకున్నారు. ఈ కేంద్రాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభించాయని, వాటితో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను విస్మరించి పాలన సాగిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీటీసీ సుజనాదామోదర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు శశిధర్‌రెడ్డి, సంతోశ్, మైనోద్దీన్, రమేశ్, నర్సింహులు, భోజ్యానాయక్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



పేపర్ ప్లేట్స్, గ్లాసుల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్



అనంతగిరి: మాట్లాడుతున్న కమిషనర్ జాకీర్ అహ్మద్

అనంతగిరి: రాబోయే 72 గంటలు భారీ వర్షాలు ఉన్నందునా మున్సిపల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తమై తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడ ఏ సమాచారం వచ్చినా తక్షణమే అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ వాసులకు ఏమైన సమస్య ఉంటే వెంటనే కంట్రోల్ రూం 9398227053 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

వర్షాలతో జాగ్రత్తగా ఉండండి..

మోమిన్‌పేట: రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి బారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ తెలపడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. వాగులు దాటే సమయంలో, పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

పాత ఇళ్లలో ఉండొద్దు

తాండూరు రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పాతబడిన ఇళ్లు ఉంటే వెంటనే సమీపంలోని పాఠశాలతో పాటు ప్రభుత్వ భవనాల వద్ద ప్రజలు ఆశ్రయం తీసుకోవాలని సూచించారు.



దుద్యాల్: మాట్లాడుతున్న ఎస్‌ఐ

అవసరమైతే తప్ప బయటకు రావొద్దు

దుద్యాల్: భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప భయటకు రావొద్దని ఎస్‌ఐ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గుర్తు చేశారు. మండలంలో రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న సందర్భంగా ఆ వైపుగా ప్రయాణించే వారు జాగ్రత్తగా వెళ్లాలన్నారు.

అధిక వర్షాలతో జాగ్రత్త అవసరం

దోమ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోవిందమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

చేపలు పట్టనివ్వట్లేదు

- ఇబ్బందులకు గురి చేయడం తగదు
- హస్నాబాద్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ముదిగిండ్ల కృష్ణ

దుద్యాల్: గ్రామానికి చెందిన పెద్ద చెరువులో ఏనిమిది సంవత్సరాలుగా చేపలు పట్టనివ్వకుండా మత్స్యకారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, హస్నాబాద్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ముదిగిండ్ల కృష్ణ పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే కొందరు మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హస్నాబాద్ గ్రామంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాల క్రితం చెరువులో నీరు తగ్గిపోవడంతో రూ. 30లక్షల చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. రాజకీయ కక్షతో పోలీసుల సహకారంతో ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. దాదాపు 98 మంది మత్స్యకారులను చేపలు పట్టనివ్వకుండా బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. హస్నాబాద్ మత్స్య సహకార సంఘంపై విచారణ చేపట్టాలని మంగళవారం జిల్లా మత్స్య సహకార శాఖ అధికారులను కొందరు నాయకులు, గ్రామస్తులు కలిసిన నేపథ్యంలో వివరణ ఇచ్చారు. మత్స్య సహకార సంఘంపై ఎప్పుడైన విచారణ చేపట్టొచ్చని, మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, ఎలాంటి అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. 15 రోజుల క్రితం మత్స్య సహకార సంఘంలో కొత్త సభ్యులను చేర్చుకోవడానికి సమావేశం ఏర్పాటు చేశామని, దాదాపుగా 150 మంది కొత్త సభ్యులు కూడా దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో హస్నాబాద్ మత్స్య సహకార సంఘం సెక్రెటరీ వెంకటయ్య, ఉపాధ్యక్షుడు గువ్వ అంజిలప్ప, డైరెక్టర్లు రమేశ్, శ్యామప్ప, వెంకటప్ప, ఎరన్‌పల్లి కిష్టప్ప, బెస్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ, మత్స్య సహకార సంఘం సభ్యులు